క్లుప్తంగా

ఫుట్‌బాల్ క్రీడాకారులకు దుస్తులు వితరణ



గోపాల్‌పేట: ప్రతిరోజు ఆటలు ఆడటం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువు, చేసే పనుల్లో ఏకాగ్రతతో పెరుగుతుందని వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ ఫుట్‌బాల్ ఆడే 30 మంది క్రీడాకారులకు దుస్తులు వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్, వనపర్తి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయబృంద సభ్యులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

అమరచింత: పట్టణంలోని పదో వార్డులో ఉన్న గ్రామ కంఠం స్థలంలో ఇందిరమ్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహాంకాళి విష్ణు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ నూరుల్ నదీంకు గురువారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తొకలి యాదగిరి, రాఘవేంద్రం, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు సూర్యకమల్, నవీన్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని మారెమ్మకుంటలో నివాసం ఉంటున్న ఏర్వ కృష్ణయ్య ఈ నెల 6 తేదీ నుంచి కనబడటం లేదని ఆయన కుమారుడు ఏర్వ సాయికుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. పట్టణ ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్వ కృష్ణయ్య బీడీలు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి ఈ నెల 6 తేదీన రాత్రి వెళ్లిపోయాడు. కానీ అతడు ఇంత వరకు ఇంటికి తిరిగి రాకపోయేసరికి గురువారం బాధితుడి కుమారుడు ఏర్వ సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మద్యం డిపోలో చోరీ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్ల శివారులోని తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఎంఎఫ్ఎల్) మద్యం డిపోలో బుధవారం అర్ధరాత్రి 62 బీరు కాటన్ల చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం వనపర్తి మండలంలోని కడుకుంట్ల శివారులోని మద్యం డిపోలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గోదాం గోడలకు ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి గుట్ట పక్కన ఉన్న బీరు గోదాం వెనుక భాగంలో ఉన్న షటర్‌ను రాడ్లతో పగలగొట్టి అందులోంచి బీరు కాటన్లను తీసుకెళ్లారు. ఈ విషయంపై మద్యం డిపో మేనేజర్ రవీందర్‌రావు 62 బీరు కాటన్ల మద్యం చోరీ అవ్వగా.. వాటి విలువ రూ.1.45 లక్షల ఉంటుందని పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించండి

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం సబ్‌స్టేషన్ నుంచి తమకు లోవోల్టేజీ సమస్య తలెత్తుతోందని, అధికారులు పరిష్కరించాలని రైతులు సబ్‌స్టేషన్ అధికారులకు విన్నవించారు. మూడు రోజుల క్రితం లోవోల్టేజీ సమస్య వస్తే అధికారులకు చెప్పామని, అయినా గురువారం అదే సమస్య పునరావృతం అయ్యిందని బుద్దారం గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే జరిగితే మోటార్లు నడవక పంటలు దెబ్బతినే అవకాశం ఉందని వాపోయారు. ఇదే విషయంపై గోపాల్‌పేట ట్రాన్స్‌కో ఏఈ హర్షవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా మూడు రోజుల క్రితం లోవోల్టేజీ సమస్య తలెత్తిందని, రైతులు సమస్యను తన దృష్టికి తీసుకురాగా సబ్‌స్టేషన్‌లో ట్యాప్ పెంచి వోల్టేజీ సమస్యను పరిష్కరించామని తెలిపారు. కానీ గురువారం ఎటువంటి సమస్య లేదు. రైతులు వచ్చి వెళ్లారని, సమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

పాన్‌గల్: అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం సాయి ఈశ్వర్‌రెడ్డి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మధ్యాహ్న భోజన వంట కార్మికురాలు పద్మమ్మను శాలువాతో ఘనంగా సన్మానించారు.



ఆర్థిక స్వావలంబన దిశగా..

- చిరుధాన్యాల ఆహార ఉత్పత్తిలో రాణిస్తున్న నారీమణులు
- కుటుంబ పోషణలో కీలక భూమిక



చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులపై శిక్షణ తీసుకుంటున్న మహిళలు

మదనాపురం: నేటి మహిళలు పురుషులతో సమానంగా కుటుంబ బాధ్యతలు స్వీకరించేందుకు ముందడుగు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వ్యవసాయ రంగంలో అనేక విధాలుగా నష్టపోతున్న నేపథ్యంలో నారీమణులు ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేకంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేస్తూ కుటీర పరిశ్రమలుగా ఏర్పాటు చేసి ఆర్థిక స్వావలంభన సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త అనిత ఆధ్వర్యంలో చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల తయారీలో మహిళలకు శిక్షణ ఇస్తూ ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

పూర్వీకులు తీసుకున్న ఆహారమే...

మన పూర్వీకులు ఆహారంగా తీసుకున్న చిరుధాన్యాలకు ప్రస్తుతం విపరీతమైన ఆదరణ పెరుగుతోంది. చిరుధాన్యాలు రోజు ఆహారంగా తీసుకుంటే షుగర్, గుండె జబ్బు, బీపీ తదితర వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని డాక్టర్లు సూచిస్తుండడంతో ప్రజల్లో క్రమంగా వీటిని ఆహారంలో భాగం చేసుకుంటున్నారు.

35 రకాల ఆహార ఉత్పత్తులు

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో దుప్పల్లి, మదనాపురం, దంతనూరు, కొత్తకోట, నిర్వేన్, అమరచింత, ఆత్మకూర్, పిన్నంచర్లతో పాటు దత్తత గ్రామాలకు చెందిన మహిళలు చిరుధాన్యాలతో బిస్కెట్లు, మురుకులు, చెక్కిలు, లడ్లు, అటుకులు, బ్రెడ్లు, కేకు, సహా 35 రకాల చిరుధాన్యాల ఉత్పత్తులను తయారు చేయడంలో శిక్షణ పొందారు. ధాన్యాన్ని రవ్వగా పిండిగా మార్చే ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియను సైతం నేర్చుకున్నారు.

మహిళలకు లాభదాయకమే



మదనాపురం కేవీకేలో మహిళలకు నైపుణ్య శిక్షణలు ఇవ్వడం ఎంతో బాగుంది. నేను అక్కడే చిక్కిళ్లు, మురుకులు, కేకులు, రాగి ముద్దలు తదితర ఆహార పదార్థాలు తయారు చేసే విధానాన్ని నేర్చుకున్నాను. చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల కోసం బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునే వెసులుబాటు ఉంది. ఈ ఆహారం తీసుకుంటే వివిధ రకాలైన జబ్బుల నుంచి దూరంగా ఉండొచ్చు. రానున్న వీటికి రోజుల్లో మరింత డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయి.

– శ్రావణి, దంతనూరు

మార్కెట్‌లో డిమాండ్



కేవీకేలో గృహ విజ్ఞాన విభాగం ఆధ్వర్యంలో మహిళలకు ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్నాము. చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులపై నిరంతరం శిక్షణ కొనసాగుతుంది. వీటికి మార్కెట్ డిమాండ్ అధికంగా ఉంది. వీటి తయారు చేసి మార్కెట్ చేసుకుంటే మహిళలకు ఉపాధి పుష్కలంగా దొరుకుతుంది. తమ కుటుంబ సభ్యులకు కూడా పోషకాలు అధికంగా ఉండే ఆహారం సిద్ధం చేసుకోవచ్చు.

– అనిత, కేవీకే శాస్త్రవేత్త

దైవారాధనతో సత్ఫలితాలు



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న బ్రహ్మకుమారీ

వనపర్తి టౌన్: నిత్యం దైవారాధన చేస్తే సత్ఫలితాలు చేకూరుతాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రంలో గురువారం శివ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. శివ తత్వం అనంతమైందని, అందులోని పరమార్థం గురించి రుషులు, మహానీయులు అనేక సందర్భాల్లో వెల్లడించారని గుర్తుచేశారు. అనంతరం శివ జయంతి కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. అనంతరం బ్రహ్మకుమారీస్ చిన్నారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదిత్యారెడ్డి, సయ్యద్ అక్బర్, అనీస్, సహదేవ్, రాములు, కృష్ణ, కిరణ్ కుమార్, జనార్దన్, కోట్ల రవి, బాబా, బ్రహ్మకుమారిస్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

పెబ్బేరు రూరల్: పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనపర్తి మండలంలోని పెద్దగూడెం శివారులోని రేడియంట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన బాధితులకు కంటి అందాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి, కదిరె రాములు, దివాకర్ యాదవ్, కోట్ల రవి, ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి పాటల సీడీ ఆవిష్కరణ



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన అక్షయ రికార్డింగ్ స్టూడియో సమర్పణలో జానపద కళాకారుడు మీసాల రాము పాడిన 'పిలిచిన పలుకవేమయ్యా ఓ జంగమయ్య' అనే భక్తి పాట సీడీని గురువారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, కళాకారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎత్తం కృష్ణయ్య, మల్లయ్య, జంగిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: దేశంలో కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని, దేశవ్యాప్తంగా ఓటర్లందరూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి అయ్యూబ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన పాలమూరు ప్రజాదీవెన సభకు రెట్టింపు స్థాయిలో కార్యకర్తలు హాజరై చల్లా వంశీచందర్‌రెడ్డికి మద్దతు తెలిపారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు తీరని అన్యాయం జరిగిందని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలమూరుకు మహర్దశ రానుందని ఆశాభావం వ్యక్తం చేసారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, ఎంఐఎం ఏకమైనా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థుల విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.10 లక్షలతో ఉచితంగా వైద్యం, రూ.500లకే సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చామని, ఈ నెల 11వ తేదీన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాబోతుందని వెల్లడించారు. కార్యక్రమంలో రవీందర్, నాగేష్, అరుణ్‌కుమార్, శ్యామ్, బాబు, రఘు, రమేష్, తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పెబ్బేరు రూరల్: నేషనల్ హెల్త్‌మిషన్‌లో (ఎన్‌హెచ్ఎం)లో పనిచేస్తున్న 2వ ఏఎన్ఎం, డీఈఓలు, ఎల్టీలు, ఆర్‌బీఎస్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం వనపర్తి కలెక్టర్ కార్యాయలయంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, అనిత, కిషోర్, మతీన్, 2వ ఏఎన్ఎంలు కృష్ణవేణి, సుమిత్ర, ల్యాబ్‌అసిటెంట్లు షాహిన్, డీఈఓలు మదన్, రాఘవేంద్ర, ప్రవీణ, పరశురాం,రమేష్ పాల్గొన్నారు.

స్ఫూర్తినిచ్చే.. సుభాషిణి

- తన 15వ ఏట (9వ తరగతి)నే వివాహం
- తొలి సంతానంగా ప్రత్యేక అవసరాలు గల కూతురు జననం
- నిత్యం విమర్శలు, గేలి చేయడం, నిట్టూర్పులే స్వాగతం
- సమస్యలకు ఎదురీది మనోధైర్యంతో ముందడుగు..
- డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా ఎదిగిన వైనం

పెళ్లి అంటేనే తెలియని వయసు (15 ఏళ్ల)లోనే వివాహం కావడం.. 17 ఏళ్లకే తొలి సంతానంగా ప్రత్యేక అవసరాలు గల కూతురు జన్మించడం.. మరోవైపు సమాజంలో వివక్ష.. సూటిపోటి మాటలు.. నిట్టూర్పులు.. వాటన్నింటిని మౌనంగా భరిస్తూ.. కూతురు జీవితాన్ని నిలబెట్టడంతో పాటు తాను అధ్యాపకురాలిగా ఎదిగి, అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు జడ్చర్ల బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుభాషిణి. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం..

– జడ్చర్ల టౌన్

నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన సత్యనారాయణ, వాసుదేవమ్మ దంపతులకు 8 మంది సంతానం. వారిలో ఆరుగురు ఆడపిల్లలు కాగా, ఇద్దరు మగ పిల్లలు. ఆడపిల్లల్లో రెండో సంతానమే సుభాషిణి. ఆడపిల్లలు ఎక్కువ మంది కావడంతో త్వరగా పెళ్లిళ్లు చేయాలని పెద్ద కూతురుకు 8వ తరగతిలో, రెండో కూతురు (సుభాషిణి)కి 9వ తరగతిలో వివాహం జరిపించారు. 17 ఏళ్లకే తొలి సంతానంగా కూతురు యశస్వినికి జన్మనిచ్చింది. ఆ అమ్మాయి ప్రత్యేక అవసరాలు కలిగిన సంతానం కావడంతో కష్టాలు మొదలయ్యాయి. రెండో సంతానంగా యోధన్‌కు జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ ఉస్మానియా యూనివర్సిటీలో ఎక్స్‌టర్నల్ పరీక్షలు రాసి, బీఏ డిగ్రీ, ఎంఏ తెలుగు లిటరేచర్ పీజీ కోర్సు పూర్తిచేసింది. ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో బీఎడ్, ఎంఎడ్ పూర్తిచేసింది. బీఎడ్ (1994– 95)లో టాపర్‌గా నిలిచింది. ఆ తర్వాత 1996లో డీఎస్సీ రాసి టీచర్ ఉద్యోగం సాధించింది. పనిచేసిన బొమ్మరామారం మండలం నాగినేనిపల్లి పాఠశాలలోనూ తోటి ఉపాధ్యాయుల నుంచి విమర్శలు రావడం, వివక్షకు గురవడం చోటుచేసుకున్నాయి. ఆడోళ్లకు బడి ఇస్తే, చీటి చీర లెక్క మార్చారని ఉపాధ్యాయులు గేలి చేసినా లెక్క చేయకుండా ముందుకుసాగింది. పాఠశాల గోడలపై అక్షర మాల, సూక్తులు రాయించడం ఆమె ద్వారానే మొదలైంది. 2001 ఏపీపీఎస్సీ ద్వారా జేఎల్ పరీక్ష రాసి, ఆమనగల్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2012లో స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఉత్తీర్ణత పొంది, మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా చేరారు. ప్రస్తుతం కళాశాలలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా బాధ్యతలు పోషిస్తూ విద్యార్థినుల్లో మనోధైర్యం నింపుతున్నారు.

కూతురు కోసం సైకాలజీ..

జనటిక్ సమస్యతో ప్రత్యేక అవసరాలు కలిగిన ఆడపిల్ల కలగడంతో ఆమె కోసం 2000 ఏడాదిలో మద్రాస్‌లో డిస్టెన్స్ ద్వారా సైకాలజీ కోర్సు పూర్తి చేసింది. సైకాలజీ చేశాక, సమాజం పట్ల ఆలోచించే దృక్పథం పూర్తిగా మారిపోయింది. అదే క్రమంలో కూతుర్ని కనిపెట్టుకుని బ్యూటీషియన్‌గా తీర్చిదిద్ది.. ప్రయోజకురాలిగా మార్చింది.



కూతురు యశస్వినితో అధ్యాపకురాలు సుభాషిణి

చిరునవ్వుతోనే సమాధానం..

సమస్య ఎదురైనప్పుడే సామర్థ్యం నిరూపించుకునే అవకాశం కలుగుతుందని విశ్వసిస్తా. చిన్నప్పుడే పెళ్లి కావడం, చదువు కొనసాగించినప్పుడు అనేక విమర్శలు, వివక్ష ఎదుర్కొన్నా. కూతురు పుట్టాక కష్టాలు రెట్టింపయ్యాయి. పాప స్పెషల్ కిడ్ కావడంతో సమయం కేటాయించాల్సి వచ్చేది. సమాజంలో మహిళలంటే నేటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. అన్నింటికీ చిరునవ్వుతో సమాధానం ఇవ్వడం అలవాటుగా మారింది.

– సుభాషిణి, అధ్యాపకురాలు, డిగ్రీ కళాశాల, జడ్చర్ల

అమ్మాయిల అభిరుచులే ముఖ్యం



మేఘనారెడ్డిని అభినందిస్తున్న మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి



బ్యాడ్మింటన్ ఆడుతున్న మేఘనారెడ్డి

అమరచింత: కొడుకులే పున్నామ నరకం నుంచి తప్పించేవారు అనేది పాత సామెత. ఈ నానుడని కాకతీయ మహారాజులు చేరిపేశారు. పుట్టింది అమ్మాయే అయిన యువరాజుగా పెంచి కాకతీయ సామ్రాజ్యానికి రాణిరుద్రమ్మను మహారాణిగా అందించిన చరిత్ర మనది. ఇదే తరహాలో చాలామంది తమకు కొడుకులు కలగలేదనే భావనను పక్కన పెట్టి తమ ఆశయాలను కుమార్తెలతో తీర్చుకుంటూ సంబురపడుతుంటారు. అమరచింత పట్టణానికి చెందిన మరెడ్డి రవీందర్‌రెడ్డి, శ్యామలత భార్యభర్తలు. రవీందర్‌రెడ్డి హైదరాబాద్‌లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తుండగా.. శ్యామలత ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు నెరవేర్చుతున్నారు. వీరికి మేఘనారెడ్డి, సంజనరెడ్డి కుమార్తెలు. వారు తమ అమ్మాయిల అభిరుచులను తెలుసుకుంటూ వారికి నచ్చిన క్రీడలపై మక్కువ చూపుతూ వారిలో ఉత్సాహం నింపుతున్నారు. మేఘనారెడ్డి బీఏ చదువుతూ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా ఎన్నో మెడల్స్ అందుకుంది. తాజాగా ఉగాండా వేదికగా జరిగిన టోర్నీలో మోహదీపట్నం సెయింట్ఆన్స్‌కళాశాల తరఫున బరిలోకి దిగి యువ షట్లర్ సిరీస్‌లో పసిడి పతకం సాధించగా.. సీఎం రేవంత్‌రెడ్డితో సన్మానించారు. జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్‌గా దేశం తరఫున తన కుమార్తె మేఘన ఆడాలనే లక్ష్యంతో ప్రోత్సహిస్తున్నట్లు తల్లిదండ్రులు వెల్లడించారు. చిన్నమ్మాయి సంజనరెడ్డి ప్రస్తుతం ఇంటర్ చదువుతుందని, ఆమెను సివిల్ సర్వీసెస్‌కు సిద్ధం చేస్తున్నాని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ దంపతులు మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు అనే వ్యత్యాసం లేకుండా వారిని వారి అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

కుమార్తె అయినా.. కుమారుడైన ఒక్కటే



కూతురు, అల్లుడు, మనుమరాలితో న్యాయవాది రామేశ్వర్‌రెడ్డి, అరుణ దంపతులు

ఆత్మకూర్: కుమార్తె అయినా.. కుమారుడైన ఒక్కటే అని బలంగా నమ్మారు. ఒక్క కుమార్తె చాలనుకొని ఆమెను డాక్టర్‌ను చేశారు. తల్లిదండ్రులనే ఆదర్శంగా తీసుకున్న ఆ అమ్మాయి తనకు ఒక కూతురే చాలు అనుకుని పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది చామతోట రామేశ్వర్ రెడ్డి, అరుణ దంపతులకు 1983 అక్టోబర్ 6న కుమార్తె హారిక పుట్టింది. దంపతులిద్దరూ ఒక్క కుమార్తె చాలనుకుని ఆమెను డెంటిస్ట్‌ని చేశారు. హారికకు 2006 లో ఆత్మకూర్‌కు చెందిన డాక్టర్ పాషం ప్రణయ్‌కుమార్‌రెడ్డితో వివాహం జరిపించారు. వీరికి 2008 లో కుమార్తె ధాత్రి పుట్టింది. వీరు కూడా ఒక్క కుమార్తెతోనే సంతానం చాలనుకున్నారు. తమ కూతురిని బాగా చదివించి దేశం గర్వించే స్థాయిలో నిలబెట్టాలని అభిలాషిస్తున్నారు. వీరి కూతురు ధాత్రీ ప్రస్తుతం పదో తరగతి చదువుకుంటోంది.

అవినీతి ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: మున్సిపల్ నిధులను అక్రమంగా కాజేశానని తనపై ఆరోపణలు చేయడం కాదని, రుజువులతో నిరూపిస్తే దేనికైన సిద్ధమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మున్సిపాలిటీకి మంజూరైన నిదులను కమిషనర్, అకౌంటెంట్‌తో కుమ్మక్కయి చైర్‌పర్సన్ అవినీతికి పాల్పడిందని ఆరోపించడం తగదన్నారు. తనకంటూ కొన్ని పరిధులు ఉంటాయని, కేంద్ర, ప్రభుత్వ ఆదేశాల మేరకు నిధులను అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉంటుందన్నారు. కొంతమంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ రూ.9 కోట్ల అవినీతికి పాల్పడిందని పత్రిక సమావేశంలో ఏర్పాటు చేయడం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం రూ.10.51 కోట్లు మంజూరయ్యాయని, వీటికి సంబంధించి ఇప్పటి వరకు రూ.9.77 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మదనాపురంలో మహిళలను సన్మానిస్తున్న నాయకులు



వనపర్తిలో..



రంగాపురంలో..



వీపనగండ్లలో..

సాక్షి, నెట్‌వర్క్: మహిళలు మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో రాణించాలని అధికారులు అన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులు, అధికారులను పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ పోషణలో మహిళలు భాగస్వాములు కావడమే కాకుండా వ్యాపార లావాదేవీల్లో ముందుండి నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఏపీఎం శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి, సర్వేయర్ పెన్నయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, ఎంఈఓ జయరాములు, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధతో చదివితే ఉన్నత లక్ష్యాలు చేరుకోవచ్చు



విద్యార్థులతో ఎస్ఐ, ఎంఈఓ, ఉపాధ్యాయులు

కొత్తకోట: విద్యార్థులు ఇష్టపడి చదివినప్పుడే ఆ చదువుకు సార్థకత ఏర్పడుతుందని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో గల అరుణోదయ పాఠశాల మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని గురువారం రాత్రి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ మంజునాథ్‌రెడ్డితో పాటు ఎంఈఓ కృష్ణయ్యలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో అన్నింటికన్న విద్యా రంగానికే అధిక ప్రాధాన్యం ఉన్నదని, చదువులో ఎవరూ నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమలో పాఠశాల కరస్పాండెంట్ చీర్ల రమేష్, ప్రిన్సిపాల్ అశోక్, వక్తలు భీమ రవి, అనిల్‌కుమార్, అధ్యాపకులు స్వాతి, ప్రవళిక, జేబా, రమ్య, లక్ష్మి, సుజాత, సబీయా, దేవి, లత, భాను, మౌనిక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పెబ్బేరు రూరల్: మండలంలోని చెలిమిల్లకు చెందిన మంగళి శ్రీనివాసులు మృతి చెందగా.. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి గురువారం మృతి చెందగా.. చిన్నారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, రాములు యాదవ్, ఎంపీటీసీ ఎల్లస్వామియాదవ్, శ్రీనివాసులు, రాముడుయాదవ్, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వరయ్య తాతయ్యనాయక్, వడ్ల వెంకటయ్య, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..

వనపర్తి మండలంలోని కడుకుంట్లకు చెందిన సురేష్ గత నెల 27న డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సురేష్‌తో పాటు చదువుకున్న స్నేహితులు కదిరె సురేష్, బాలరాజు, దాసరి శివ గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.40 వేల ఆర్థికసాయం అందించారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన రాసమోని వినోద్ (40) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక బీసీ సంఘం నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్ననాయుడు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బాజిగిరన్న, సాయిలు, పెద్ద కుర్మన్న, ఆర్.గోవర్ధన్, బాబు, ధనుష్, రాజు, అశోక్, రవి, ఉమ, విష్ణు తదితరులు ఉన్నారు.